# ఆత్మప్రేరణము

శ్రీమతి కొత్తపల్లి కౌసల్యాదేవిగారు

శశిముఖీదేవి:—అమ్మా! దేశసేవాకృత్యములకు వలయు సుగుణదీపములు మీహృదయములో వెలుఁగుచున్నవి. ఆదీపకాంతులచే నాహృదయాంధకారమును దొలఁగింపుము! చిరవాంఛితమగు మీదర్శనభాగ్యము నేఁడు లభించినది.

స్వరాజ్యలక్ష్మి:—ప్రియసఖీ! ప్రపంచమున నొకరినొకరు శ్లాఘించుకొనుచుండుట నేఁడొకసాధారణకర్మ. దానికేమి? దేశము నుద్ధరించుటకు బద్ధకంకణులై ఎందఱో వీరవరులగు భారతపురుషులు; ఎందఱో పరమసుకుమారలగు సాధ్వీమతల్లులు తమ సర్వస్వము ధారవోసిరి. రానున్న విపత్తుల నెదుర్కొనుటకై వారికి మిగిలిన దొక్కప్రాణమే! అదియుఁ జెల్లింపక వారు తృప్తిపడరు. అట్టిచో ఆపర్వతములచెంత ఈపరమాణువెంత? నీకును మించినదేమియులేదు. నీవు సేవారంగమున నుపక్రమింప సంసిద్ధవుకమ్మ. ధర్మాచరణమునకు ద్వార మెప్పుడును దెఱచియేయుండు.

శశిముఖీదేవి:—అమ్మా! సంసారభారము తలఁదాల్చి ఱాతిక్రింది మండూకమునవలెనుండు నాకీప్రభావ మెటులబ్బును? అయినను కొలువుగుదిరిన యుద్యోగిభార్యకు స్వేచ్ఛ యెక్కడిది? ఈధర్మయుద్ధమునఁ బాల్గొనెడిహక్కు నాకులేదు.

స్వరాజ్యలక్ష్మి:—అట్లనకుము! బయటివారెవ్వరు స్వేచ్ఛను దానమియ్యరు. నీకులోనైనహృదయమే దానినిచ్చును. ఇచ్ఛయున్నచో త్యాగమెంత సులభము? అది కవాటము తెఱచినట్లొక్కత్రుటిలో వచ్చిపడును. అటుపై నేదియుఁ గర్తవ్యము నడ్డగింపదు. ఇఁక నీపతి యుద్యోగప్రతిబంధ మెంత? అంతరమెందుకు? ఈసమరము బాలురు, వృద్ధులు, స్త్రీలు అను భేదములేక ఎల్లరకును సాధ్యమైన శాంతిసమరము. ఇందుఁ బురుషులకన్న అబలలే ప్రబలలు. దీనికై ఇల్లు, వాకిలి, సంసారము ఏదియు వీడనక్కఱలేదు. నీగృహమే రణరంగము. రాట్నమే నీయాయుధము. ఖద్దరుధారణమే నీవిజయలాంఛనము. ఈమాత్రమునకుఁ జాలవా సోదరీ!

శశిముఖీదేవి:—ధన్యురాలను! మీరాకచే నేఁడు మాగృహము పవిత్రము. కర్తవ్యమంత్రముపదేశించిన మీకు వినమ్రనై మ్రొక్కుచుంటి.

స్వరాజ్యలక్ష్మి:—ఈమ్రొక్కుబడులు నాకక్కఱలేదు. (పటమువంకఁజూపి) అదిగో! ఆమహాత్ముని కర్పింపుము. ఈకర్మయోగమున కల్ల నతఁడే మూలగురుఁడు. చూడు! ఒకజీర్ణతాళపత్రసంపుటములో నిమిడియున్న కవిత్వమహిమవలె ఆబడుగుదేహములో నొకమహాజ్యోతి ఏకాగ్రముగ వెలుఁగుచున్నది. అది పొగలేని యగ్ని. మచ్చలేని చందమామ.

శశిముఖీదేవి:—నిశ్చయము! ఓతండ్రీ! ఇట్టి శుద్ధదీనస్వరూప మేయుగమున విశ్వవ్యోమాసనమునపై రంజిల్లినది? నేఁడు నీకుఁ జెల్లినదిగాక! నీమహత్త్వము ఈసృష్టివలె అగాధము నిగూఢమునైయున్నది. అది పాండిత్యములేకయే తెలియును. ఉన్నను దెలియదు. నావల్లనయ్యెడు ఈనమస్సులైనను బరిగ్రహింపుము, మహాత్మా!

స్వరాజ్యలక్ష్మి:—చెచ్చెలీ! నేఁడు విజయలక్ష్మీదేవిగారి యాజమాన్యమున జరుగు పతాకవందనోత్సవములోఁ బాల్గొన ధైర్యమవలంబింపుము. రమ్మా! పోవుదము! (నిష్క్రాంతము)

## పతాకవందనోత్సవము

విజయలక్ష్మీదేవి:—భారతనారీమణులారా! ధర్మమే జయము. ధర్మములేనిచో జయములేదు. మనమిపుడనుభవించుచున్న దాస్యము మనలో ధర్మము శుష్కించినదనుటకైన గుఱుతు. మిథ్యామతము, శుష్క-

1035

వేదాంతము, మూఢదురాచారము, అంధవిశ్వాసము, దంభైకజీవనము మున్నగు చెడుగులెన్నియో మనలఁజేరి ధర్మమును హింసించినవి. మానవధర్మమును హింసింపరాదనుటయే మహాత్ముని అహింసాతత్త్వమునకు అర్థము. నిర్వ్యాపారము, భోగపరాయణత్వము వీనిచేఁ బురుషజాతి నిర్వీర్యము. అస్వాతంత్ర్యము రాణీవాసము వీనిచే స్త్రీజాతి యధఃపతితము. పరపీడనము, కుక్షింభరత్వము వీనిచే అగ్రజాతి స్వార్థదూషితము. ఇఁక ధర్మమునకుఁ దావేది? మీఁదు మిక్కిలి ఇవి శాస్త్రసమ్మతములని ప్రమాణములఁజూపు బుద్ధిజాడ్యమునకులోనై విఱ్ఱవీగుట ఎంతటి యపహాస్యము? దేశము, కాలము, పాత్రము, ఆత్మబుద్ధి వీనికంటె మనుజధర్మమును శాసించు పరమప్రమాణములెవ్వి? ఏఱెండ కాగొడుగనునట్లు ధర్మము నుచితగతిని నడపింపక చెడితిమి. రత్నముపోయిన వెనుక పెట్టెను భద్రపఱచినట్లు ధర్మశూన్యమగు పట్టియాచారమును నిష్ఠతోఁ బదిలము చేసితిమి. పుణ్యముచే ఆర్యులమై పుట్టితిమనుట బూటకమొనర్చితిమి. ఇట్టి తప్పిదమునకైన దండనయే ఈదాస్యప్రారబ్ధము. ఈప్రారబ్ధ మంతరింపఁజేయుటకు కారణజన్ముఁడై మహాత్ముఁ డవతరించెను. ఇపుడమ్మహాత్ముని సత్యసందేశము మన దుర్భ్రమలనన్నిటిని దుడిచిపెట్టినది. మన హృదయపీఠములు శుద్ధిచేయఁబడినవి. వానిపై మరల ధర్మదేవత యధిష్ఠితయగుచున్నది. శక్త్యనుసార మీధర్మవ్రతము నిర్వహింపవచ్చు. దీనికై ధనరాసులు వెదజల్లనక్కఱలేదు. రక్తధారలు కురియింప నక్కఱలేదు. తుదకు రాట్నముచేపట్టి ఖద్దరుధరించినఁ జాలు. అంతతో మనదాస్యము వినశ్యమగును. జయము సిద్ధించును. ఇదే మనధర్మము. మనమార్యులము! ఆర్యనామమున కర్థము ప్రపంచము తెలిసికొనుగాక! మన యంతరంగములలోఁ బునఃప్రతిష్ఠితమగుచున్న జాతీయ ధర్మమునకొక్క బాహ్యచిహ్నమే ఈజాతీయపతాక! నిక్కపుభక్తితో నిజమైన పరమార్థబుద్ధితో భరతమాతను స్మరించి ఏకోన్ముఖముగా ఈజాతీయపతాకకు మోకరిల్లి మ్రొక్కుఁడు. ఓకృపాసింధూ! దీనబంధూ! మాహృదయములకు దార్ఢ్య మనుగ్రహింపుము.

జయ భారతజనయిత్రికి జై! జయ గాంధిమహాత్మునికి జై! జయ జాతీయపతాకకు జై!

# చాషమిథునము

నాదెళ్ల వేంకటరావుగారు బి. ఏ.

పట్టపగలెల్లఁబొట్టకై పాటుపడిన
శ్రమ మపనయించుకోరిక సందెవేళ
దినము మాయూరికైలువంతెనకుఁ జనుచుఁ
గూరుచునివతు నొంటిమైఁగొంతసేపు.
పరిగనచ్చోటికే నేఁగుసమయమునకె
చెంతఁగనుపించు నలసీమచింతచెట్టు
మీఁదికెగురుచునేతెంచి యాదరమునఁ
బాలపిట్టలు రెండు నుయ్యాలలూఁగు.
ఏమిభాషించుకొనునో నేనెఱుఁగకున్న
నతిమధురములు వానికూజితములహాహా!
రాగతాళాదు లెఱుఁగంగరాకయున్నఁ
జెవులకింపైన సంగీతరవమువోలె.

మూతిమూతినిగలుపుచుముద్దులాడు
మెడమెడనుజట్టిపెనవైచిమేలమాడు
లీలఁబలిటీలుగొట్టుచు వ్రాలిసోలుఁ
బాలపిట్టలజంట సంబరముమెఱసి
వన్నెవన్నెలదేహముల్ వంచివంచి
గఱులువిదలించుకొను సోయగంబుఁగాంచి
పిట్టనై భూమిపై నేలపుట్టనైతి
ననుచుమిక్కిలివగతు నేననుదినంబు.
భోగభాగ్యంబులకుఁ జింతఁబొందఁబోవు
నగలకోసముకయ్యమెన్నటికిరాదు
బ్రతుకుకేలాగురేపను బాధలేదు
పత్నులదెగద దివ్యదాంపత్యమవుర!